# జెర్సీ మారినా రాత మారలె!

**ఒక్క పరుగు తేడాతో ఓడిన బెంగళూరు**
**ఉత్కంఠ పోరులో కోల్‌కతాదే పైచేయి**
**రస్సెల్ ఆల్‌రౌండ్ షో**

ప్రతి ఏడాది ఐపీఎల్ సీజన్ ఒక మ్యాచ్‌లో ఆకుపచ్చ జెర్సీ ధరించి మ్యాచ్ ఆడే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)కు 2024లో కూడా కలిసిరాలేదు. ఇప్పటికే ఈ సీజన్‌లో వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానాన నిలిచిన ఆర్సీబీ.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్‌లోనూ ఒక్క పరుగు తేడాతో ఓడి తమ అపజయాల పరంపరను కొనసాగించింది. బంతి బంతికీ ఆధిక్యం చేతులు మారుతూ వచ్చిన ఉత్కంఠ పోరులో కోల్‌కతా.. 222 పరుగులు చేసినా గెలుపు కోసం చివరి బంతిదాకా వేచి చూడాల్సి వచ్చింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ సమిష్టిగా రాణించిన కేకేఆర్ ఐదో విజయాన్ని దక్కించుకోగా ఆర్సీబీ ఏడో ఓటమితో ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపుగా నిష్క్రమించినట్టే!



రస్సెల్ (3/25; 27*)

సాల్ట్ (48)

కోల్‌కతా: ఐపీఎల్-17లో వరుస పరాభవాలతో నిరాశపరుస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఖాతాలో ఏడో (వరుసగా ఆరు) ఓటమి. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క పరుగు తేడాతో ఆర్సీబీ ఓటమిపాలైంది. కోల్‌కతా నిర్దేశించిన 223 పరుగుల ఛేదనలో విల్ జాక్స్ (32 బంతుల్లో 55, 4 ఫోర్లు, 5 సిక్సర్లు), రజత్ పాటిదార్ (23 బంతుల్లో 52, 3 ఫోర్లు, 5 సిక్సర్లు), దినేశ్ కార్తీక్ (18 బంతుల్లో 25, 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాటానికి తోడు ఆఖర్లో కర్ణ్ శర్మ (7 బంతుల్లో 20, 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించినా ఆ జట్టు 20 ఓవర్లలో 221 పరుగుల వద్దే ఆగిపోయింది. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా.. 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 50, 7 ఫోర్లు, 1 సిక్స్), ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 48, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. బ్యాట్‌తో (20 బంతుల్లో 27 నాటౌట్, 4 ఫోర్లు) పాటు బంతి (3/25)తోనూ మెరిసిన ఆండ్రీ రస్సెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

## దంచుడు మంత్రం

భారీ ఛేదనలో ఆర్సీబీ బ్యాటర్లు ఆది నుంచే దంచుడు మంత్రాన్ని పఠించారు. కోహ్లీ (7 బంతుల్లో 18, 1 ఫోర్, 2 సిక్సర్లు) తొలి ఓవర్‌లోనే 4, 6తో బాదుడుకు గేట్లు ఎత్తేశాడు. కానీ హర్షిత్ రాణా 2వ ఓవర్లో వివాదాస్పద నిర్ణయంతో పెవిలియన్ చేరాడు. నడుము కంటే ఎక్కువ ఎత్తులో వచ్చిన బంతిని ఆడబోయి హర్షిత్‌కే క్యాచ్ ఇచ్చాడు. డుప్లెసిస్ (7) విఫలమైనా జాక్స్, పాటిదార్‌లు కేకేఆర్ బౌలర్లను ఆటాడుకున్నారు. స్టార్క్ 4వ ఓవర్లో జాక్స్.. మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో చెలరేగితే సుయాశ్ శర్మ పదో ఓవర్లో పాటిదార్ 4, 6, 6, 4తో రెచ్చిపోయాడు. 29 బంతుల్లో జాక్స్ అర్ధ సెంచరీ పూర్తి కాగా పాటిదార్ 21 బంతుల్లోనే దానిని పూర్తి చేశాడు. వీళ్లిద్దరి దూకుడుతో ఆర్సీబీ 11 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసింది.

## 12 బంతుల వ్యవధిలో 4 వికెట్లు

అనిశ్చితికి మారుపేరైన ఆర్సీబీ మరోసారి తడబాటుకు గురైంది. 2 ఓవర్ల వ్యవధిలో ఆ జట్టు నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. రస్సెల్ వేసిన 12వ ఓవర్లో మొదటి బంతికి జాక్స్.. రఘువంశీకి క్యాచ్ ఇవ్వగా నాలుగో బంతికి పాటిదార్.. రాణా చేతికి చిక్కాడు. సునీల్ నరైన్.. గ్రీన్ (6), లోమ్రర్ (4)ను బుట్టలో వేసుకున్నాడు. ప్రభుదేశాయ్ (18 బంతుల్లో 24, 3 ఫోర్లు)తో కలిసి కార్తీక్ పోరాడటంతో ఆర్సీబీ విజయానికి దగ్గరగా వచ్చింది. 19వ ఓవర్లో కార్తీక్‌ను ఔట్ చేసి రస్సెల్ మరోసారి బెంగళూరును దెబ్బకొట్టాడు.

**1** ఒక్క పరుగు తేడాతో మ్యాచ్ గెలవడం ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఇదే ప్రథమం. ఒక్క పరుగు తేడాతో ఓడటం ఆర్సీబీకి తొలిసారి.



## నరైన్ అరుదైన ఘనత

ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీయడం ద్వారా సునీల్ నరైన్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో ఒక ఫ్రాంచైజీ తరఫున ఆడుతూ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఈ విండీస్ వీరుడు రికార్డులకెక్కాడు. కేకేఆర్‌కు 169 మ్యాచ్‌లలో నరైన్.. 172 వికెట్లు పడగొట్టాడు. గతంలో ఈ రికార్డు ముంబై ఇండియన్స్ (ఎంఐ) తరఫున ఆడిన లంక దిగ్గజ పేసర్ లసిత్ మలింగ పేరిట ఉండేది. మలింగ.. ఎంఐ తరఫున 170 వికెట్లు తీశాడు. బుమ్రా (ముంబై - 158), భువనేశ్వర్ (ఎస్ఆర్‌హెచ్-158) తదుపరి స్థానాల్లో నిలిచారు.

## ఆఖరి ఓవర్లో హైడ్రామా

కార్తీక్ ఔట్ అవడంతో ఆర్సీబీ కథ ముగిసిందని అనుకున్నా స్టార్క్ వేసిన చివరి ఓవర్లో కర్ణ్ శర్మ.. తొలి నాలుగు బంతుల్లో 3 సిక్సర్లు కొట్టి మళ్లీ ఆ జట్టును పోటీలోకి తెచ్చాడు. దీంతో ఆర్సీబీ విజయానికి 2 బంతుల్లో 3 పరుగులు అవసరమవడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. కానీ దురదృష్టం ఆర్సీబీని మరోసారి వెంటాడింది. ఐదో బంతికి కర్ణ్.. స్టార్క్‌కే రిటర్న్ క్యాచ్ ఇవ్వగా ఆఖరి బంతికి ఫెర్గూసన్ రెండో పరుగు కోసం యత్నించి రనౌట్ అవడంతో కోల్‌కతా ఊపిరి పీల్చుకుంది. ఆర్సీబీకి మరోసారి గుండె పగిలింది.

### సంక్షిప్త స్కోర్లు

**కోల్‌కతా :** 20 ఓవర్లలో 222/6 (శ్రేయస్ 50, సాల్ట్ 48, గ్రీన్ 35/2, దయాల్ 2/56), **బెంగళూరు :** 20 ఓవర్లలో 221 ఆలౌట్ (జాక్స్ 55, రజత్ 52, రస్సెల్ 3/25, రాణా 2/33)

## మెరిసిన సాల్ట్, అయ్యర్, రమణ్‌దీప్

మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా బ్యాటర్లు ఆర్సీబీ బౌలర్లపై దాడికి దిగారు. ఈ సీజన్‌లో జోరు మీదున్న నరైన్ (10), రఘువంశీల (3)లు విఫలమైనా ఓపెనర్ ఫిల్ సాల్ట్ మాత్రం తనదైన రీతిలో చెలరేగాడు. సిరాజ్ తొలి ఓవర్లోనే 6,4 తో పరుగుల ఖాతా తెరిచిన అతడు ఫెర్గూసన్‌కు నాలుగో ఓవర్లో చుక్కలు చూపించాడు. 6, 4, 4, 6, 4, 4 తో అతడి విధ్వంసం పతాకస్థాయికి చేరింది. సాల్ట్‌ను సిరాజ్ ఔట్ చేసినా మిడిల్ ఓవర్స్‌లో శ్రేయస్ అయ్యర్ పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేశాడు. రింకూ సింగ్ (16 బంతుల్లో 24, 2 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. అయ్యర్ నిష్క్రమించడంతో రమణ్‌దీప్ సింగ్ క్రీజులోకి వచ్చాడు. అతడు సిరాజ్ 19వ ఓవర్లో 6, 6, 4 బాదడంతో కేకేఆర్ స్కోరు 200 దాటింది. ఆఖరి ఓవర్లో రస్సెల్ రెండు, రమణ్‌దీప్ ఓ బౌండరీతో కేకేఆర్ మరోసారి భారీ స్కోరు సాధించింది.

# పంజాబ్‌ను తిప్పేసిన సాయి

**4 వికెట్లతో విజృంభణ • కింగ్స్‌ను చిత్తుచేసిన టైటాన్స్ • రాణించిన గిల్, తెవాటియా**

ఇటీవలే ఢిల్లీ చేతిలో అవమానకర ఓటమి మూటగట్టుకున్న గుజరాత్ టైటాన్స్ మళ్లీ పుంజుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసి ఆ తర్వాత లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ దంచేసింది. టైటాన్స్ స్పిన్నర్ సాయి కిషోర్ నాలుగు వికెట్లతో చెలరేగి పంజాబ్‌ను కోలుకోనీయకుండా చేశాడు. బ్యాటింగ్‌లో గిల్, సుదర్శన్‌లు బాధ్యతాయుతంగా ఆడితే ఆఖర్లో తెవాటియా ఫినిషింగ్ టచ్ ఇచ్చి టైటాన్స్‌ను గెలిపించారు. ఈ సీజన్‌లో గుజరాత్‌కు ఇది నాలుగో విజయం కాగా పంజాబ్‌కు ఐదో పరాజయం.



సాయి (4/33)

తెవాటియా (36*)

ముల్లాన్‌పూర్: సొంత గడ్డపై మ్యాచ్‌లు ఆడుతున్నా పంజాబ్ కింగ్స్ మాత్రం ఓటముల పరంపరను కొనసాగిస్తోంది. ముల్లాన్‌పూర్ వేదికగా పంజాబ్‌ను గుజరాత్ 3 వికెట్ల తేడాతో చిత్తుచేయడంతో ఆ జట్టు వరుసగా నాలుగో ఓటమిని మూటగట్టుకుంది. టైటాన్స్ స్పిన్నర్ సాయికిషోర్ (4/33), నూర్ అహ్మద్ (2/20) స్పిన్ మాయాజాలంతో మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్.. 20 ఓవర్లలో 142 పరుగులకే ఆలౌట్ అయింది. ప్రభ్‌సిమ్రన్ (21 బంతుల్లో 35, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. అనంతరం లక్ష్యాన్ని గుజరాత్.. 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాహుల్ తెవాటియా (18 బంతుల్లో 36 నాటౌట్, 7 ఫోర్లు), ఆ జట్టు సారథి శుభ్‌మన్ గిల్ (29 బంతుల్లో 35, 5 ఫోర్లు) రాణించారు. పంజాబ్ పతనాన్ని శాసించిన సాయికిషోర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### స్పిన్ ఉచ్చులో కింగ్స్ కట్టడి

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్‌కు ఓపెనర్లు కెప్టెన్ సామ్ కరన్ (19 బంతుల్లో 20, 2 ఫోర్లు), ప్రభ్‌సిమ్రన్‌లు శుభారంభమే అందించారు. సందీప్ వారియర్ రెండో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ మూడు బౌండరీలు ఓ సిక్సర్ సాయంతో 21 పరుగులు రాబట్టాడు. మోహిత్ శర్మ ఆరో ఓవర్లో ఈ జోడీని విడదీసి 52 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఆ తర్వాత స్పిన్నర్ల రాకతో పంజాబ్ కోలుకోలేదు. రూసో (9)ను నూర్ అహ్మద్ ఔట్ చేయగా జితేశ్ శర్మ (13)ను సాయి బౌల్డ్ చేశాడు. పంజాబ్ భారీ ఆశలు పెట్టుకున్న లివింగ్‌స్టోన్ (6) అహ్మద్ బౌలింగ్‌లో తెవాటియాకు క్యాచ్ ఇవ్వగా ఈ సీజన్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న శశాంక్ సింగ్ (8), అశుతోష్ శర్మ (3)లను సాయి బోల్తా కొట్టించాడు ఆఖర్లో హర్‌ప్రీత్ బ్రర్ (12 బంతుల్లో 29, 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. బ్రర్ వికెట్ కూడా సాయికే దక్కింది.

### గుజరాత్ ఆడుతూ పాడుతూ..

స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (11 బంతుల్లో 13, 1 ఫోర్), గిల్ తొలి వికెట్‌కు 66 పరుగులు జోడించారు. సాహా విఫలమైనా గిల్ ఫోర్లతో అలరించాడు. స్వల్ప వ్యవధిలోనే ఈ ఇద్దరూ ఔట్ అయినా, డేవిడ్ మిల్లర్ (4) కూడా నిష్క్రమించినా సాయి సుదర్శన్ నిలకడగా ఆడుతూ టైటాన్స్‌ను లక్ష్యాన్ని దగ్గర చేశాడు. అయితే కరన్.. సుదర్శన్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడం, అజ్మతుల్లా ఒమర్‌జయ్ (13)ను హర్షల్ పటేల్ ఔట్ చేయడంతో పంజాబ్ పోటీలోకి వచ్చినట్టే కనిపించింది. కానీ 'ఫినిషర్' రాహుల్ తెవాటియా మాత్రం పంజాబ్‌కు ఆ అవకాశమివ్వలేదు. బ్రర్ 17వ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన అతడు.. రబాడా 18వ ఓవర్లో మూడు బౌండరీలతో టైటాన్స్ గెలుపును ఖాయం చేశాడు.

**4/33**

గుజరాత్ టైటాన్స్ తరఫున బౌలింగ్ చేస్తూ సాయి మూడో అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేశాడు. అంతకు ముందు రషీద్ ఖాన్ (4/24, 4/30) రెండుసార్లు నాలుగు వికెట్ల ఘనత సాధించాడు.

### సంక్షిప్త స్కోర్లు

**పంజాబ్ :** 20 ఓవర్లలో 142 ఆలౌట్ (ప్రభ్‌సిమ్రన్ 35, బ్రర్ 29, సాయి 4/33, నూర్ 2/20). **గుజరాత్ :** 19.1 ఓవర్లలో 146/7 (తెవాటియా 36 నాటౌట్, గిల్ 35, హర్షల్ 3/15, లివింగ్‌స్టోన్ 2/19)

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 7 | 6 | 1 | 0.67 | 12 |
| కోల్‌కతా | 7 | 5 | 2 | 1.20 | 10 |
| హైదరాబాద్ | 7 | 5 | 2 | 0.91 | 10 |
| చెన్నై | 7 | 4 | 3 | 0.52 | 8 |
| లక్నో | 7 | 4 | 3 | 0.12 | 8 |
| గుజరాత్ | 8 | 4 | 4 | -1.05 | 8 |
| ముంబై | 7 | 3 | 4 | -0.13 | 6 |
| ఢిల్లీ | 8 | 3 | 5 | -0.47 | 6 |
| పంజాబ్ | 8 | 2 | 6 | -0.29 | 4 |
| బెంగళూరు | 9 | 1 | 7 | -1.04 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

# నిరాశపరిచిన భారత రెజ్లర్లు

**'గ్రీకో రోమన్'లో దక్కని బెర్తు**

బిష్కెక్: ఒలింపిక్స్ బెర్తులు నిర్ణయించే ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టినా అబ్బాయిలు మాత్రం నిరాశపరిచారు. గ్రీకో రోమన్ విభాగంలో ఒక్కరంటే ఒక్కరు కూడా సెమీస్‌కు చేరుకోలేదు. ఈ కేటగిరీలో భారత్ నుంచి పోటీపడ్డ వికాస్, సునీల్, నితేశ్, నవీన్‌లు క్వార్టర్స్ కూడా దాటలేదు. 87 కిలోల విభాగంలో సునిల్.. అర్హత రౌండ్‌లో 5-1 తేడాతో జపాన్ రెజ్లర్ సోహ్ సకాబెను ఓడించినా క్వార్టర్స్‌లో చేతులెత్తేశాడు.

**మళ్లీ సెలక్షన్స్?**

బిష్కెక్‌లో భారత పురుష రెజ్లర్ల ప్రదర్శనలతో నిరాశచెందిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మళ్లీ కొత్తగా సెలక్షన్ ట్రయల్స్‌ను నిర్వహించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. బిష్కెక్‌లో మనోళ్లు బెర్తులు దక్కించుకునేందుకు విఫలమైన 14 కేటగిరీలలో సెలక్షన్స్ నిర్వహించి మే 9 నుంచి టర్కీ వేదికగా జరగాల్సి ఉన్న వరల్డ్ క్వాలిఫయర్స్‌కు పంపేందుకు సిద్ధమవుతున్నట్టు సమచారం. ఒలింపిక్స్‌లో బెర్తులు దక్కించుకునేందుకు రెజ్లర్లకు వరల్డ్ క్వాలిపయర్సే చివరి అవకాశం.

# ఒక్క అడుగు!

**టైటిల్ రేసుకు అత్యంత సమీపానికి గుకేశ్ • సోలోగా ఆధిక్యం**



టొరంటో: ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో టైటిల్ రేసుకు భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అత్యంత సమీపానికి వచ్చాడు. కీలకమైన 13వ రౌండ్‌లో గుకేశ్.. ఫ్రాన్స్‌కు చెందిన పిరౌజా అలీరెజాను ఓడించి 8.5 పాయింట్లతో టోర్నీలో సోలోగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 47 ఎత్తుల్లో ప్రత్యర్థిని చిత్తు చేసిన గుకేశ్.. చివరి రౌండ్‌లో హికారు నకమురాతో తలపడనున్నాడు. 8 పాయింట్లతో ఇయాన్ నెపొనియాచి, నకామురాలు సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ ఇద్దరి మధ్య 13వ రౌండ్ జరిగిన మ్యాచ్ డ్రాగా ముగియడం, నకామురాపై విజయంతో గుకేశ్ మొదటి స్థానానికి ఎగబాకాడు. ఈ గెలుపుతో 17 ఏండ్ల భారత కుర్రాడు.. చివరి రౌండ్ మ్యాచ్‌లో గెలిచినా, డ్రా చేసుకున్నా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో పోటీ పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే టైటిల్ రేసు నుంచి తప్పుకున్న ప్రజ్ఞానంద.. ఫాబియానో చేతిలో ఓడగా నిజత్ అబసోవ్‌తో గేమ్‌ను విదిత్ డ్రా చేసుకున్నాడు. మహిళల కేటగిరీలో భాగంగా అన్నా ముజిచుక్‌తో గేమ్‌ను కోనేరు హంపి డ్రా చేసుకోగా వైశాలి.. టింగ్జి లి (చైనా)ను ఓడించింది.

# రోయింగ్‌లో భారత్‌కు తొలి బెర్తు



చుంగ్జు: రోయింగ్ క్రీడలో భారత్ తరఫున ఒలింపిక్స్‌లో దేశానికి తొలి బెర్తు దక్కింది. దక్షిణ కొరియాలోని చుంగ్జు వేదికగా జరుగుతున్న 2024 వరల్డ్ ఆసియన్ అండ్ ఒషియానియన్ ఒలింపిక్ క్వాలిఫికేషన్‌లో భాగంగా భారత ఆర్మీకి చెందిన 25 ఏండ్ల బాల్రాజు పన్వర్.. 2000 మీటర్ల పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో భారత్‌కు బెర్తును ఖాయం చేశాడు. ఈ పోటీలలో భాగంగా 7 నిమిషాల 1.27 సెకన్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసిన అతడు మూడో స్థానంలో నిలవడంతో ఒలింపిక్ కోటాను దక్కించుకున్నాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.